పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

● నుడా అధ్యక్షులు ఓబులేష్

శ్రీకాకుళం అర్బన్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని నుడా అధ్యక్షుడు చల్లా ఓబులేసు అన్నారు. రేపటి తరాన్ని కాపాడటం మనందరి బాధ్యతన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళంలోని శాంతినగర్ కాలనీలోని గాంధీ మందిరంలో లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ప్రకృతితో మనం బాధ్యతగా ఉంటే ప్రకృతి కూడా మనల్ని ప్రేమిస్తోందన్నారు. ప్రకృతిని ప్రేమిస్తూ, పర్యావరణాన్ని రక్షిస్తూ ముందుకు సాగితే ప్రకృతి మన భవిష్యత్ తరాలకు సాయం చేస్తుందన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు పొన్నాడ రవికుమార్ మాట్లాడుతూ.. ప్రతి ఒకరూ మొక్కల్ని నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. అప్పుడే మనం నాటే మొక్క రేపటి తరానికి ఉపయోగపడుతోందన్నారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ మాట్లాడుతూ.. ప్రపంచం మొత్తం పర్యావరణం గురించి ప్రస్తుతం మాట్లాడుకుంటుందన్నారు. భూమికి కలుగుతున్న రకరకాల కాలుష్యాలను తగ్గించే గుణం మొక్కలకు, చెట్లకు ఉందన్నారు. వాటి సంరక్షణ మనమందరం కలసి చూసుకోవాలన్నారు. ఈ సందర్భంగా డే అండ్ నైట్, ఏడు రోడ్ల కూడలి, పాతబస్టాండ్‌తో పాటు పలు ముఖ్య కూడలిలో ప్రజలకు సుమారు ఏడు వందల మొక్కలను అందజేసి వాటి పరిరక్షణ బాధ్యతను వివరించారు. కార్యక్రమంలో క్లబ్ మెంటార్ నటుకుల మోహన్, జోన్ చైర్‌పర్సన్ బాడాన దేవ భూషణం, సెక్రటరీ టి.రాంగోపాల్, ట్రెజరర్ ఎస్.మణి, సభ్యులు చల్లా జోషిత, గాంధీ మందిరం ప్రతినిధి రాజారావు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై అవగాహన

శ్రీకాకుళం అర్బన్: పర్యావరణ పరిరక్షణకు వనాలు పెంపకమే సరైన మార్గమని, అందుకు ప్రతిఒక్కరూ ఒక్కో మొక్క నాటాలని ఐసీడీఎస్ శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్టు కృష్ణాపార్కు సెక్టారు పర్యవేక్షకురాలు పి.సీతామహాలక్ష్మి అన్నారు. నానుబాలవీధి, కానుకుర్తివారివీధి అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీలు స్థానికులకు మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. వార్డు పరిధిలో ర్యాలీ నిర్వహించి పర్యావరణ పరిరక్షణపై నినాదాలు చేశారు. కార్యక్రమంలో తల్లులు, బాలింతలతో పాటు ఎం.ఎస్.కె త్రివేణి, అంగన్‌వాడీ కార్యకర్తలు సుభాషిణి, ధనలక్ష్మి, ఉమ, పుష్పలత, సాయిభవాని పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగం వద్దు

శ్రీకాకుళం అర్బన్: పర్యావరణానికి ముప్పుతెచ్చే ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిద్దామని, అప్పుడే పర్యావరణం మరింత పచ్చగా ఉంటుందని బలగ గ్రంథాలయశాఖ అధికారి పి.ఉగ్రసేన అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గ్రంథాలయ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతిఒక్కరూ మొక్కలను నాటి వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలన్నారు. గ్రంథాలయ సహాయకురాలు అనిత ఉన్నారు.



ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

శ్రీకాకుళం అర్బన్: పర్యావరణంతో మానవాళికి ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బి.కుమార్‌రాజా అన్నారు. శ్రీకాకుళం జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కల నుంచి మానవాళికి కావాల్సిన ప్రాణవాయువు లభిస్తుందన్నారు. కాలుష్యం బారిన ప్రజలు పడకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ డిప్యూటీ లైబ్రేరియన్ వి.వి.జి.ఎస్.శంకరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ భాస్కర రాజా, పాఠకులు ఉన్నారు.

ఎచ్చెర్లలో..

ఎచ్చెర్ల క్యాంపస్: పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ఎస్ఎంపురం క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కేవీజీడీ బాలాజీ అన్నారు. ఆర్‌జీయూకేటీ, చిలకపాలెంలోని శివానీ ఇంజినీరింగ్ కాలేజీల్లో బుధవారం పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. జాతీయ సేవా పథకం యూనిట్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. విద్యార్థులు మొక్కలు నాటేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని వక్తలు పిలుపునిచ్చారు. ఆర్‌జీయూకేటీ ఓఎస్‌డీ సుధాకర్‌బాబు, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ మోహన్‌కృష్ణచౌదిరి, శివానీ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మొక్కలు ప్రతి ఒక్కరూ నాటాలి

శ్రీకాకుళం కల్చరల్: మొక్కలు ప్రతి ఒక్కరూ నాటాలని, పర్యావరణాన్ని కాపాడాలని సిటీ టెర్రస్ గార్డెన్ (సీటీజీ) గ్రూపు నిర్వాహకురాలు పేర్ల అనూరాధ అన్నారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని ఎల్‌బీఎస్ కాలనీలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ప్లకార్డులు చేతపట్టి మొక్కలు పరిరక్షించాలని నినాదాలు చేస్తు ర్యాలీ చేశారు. అనంతరం కాలనీలో పలు చోట్ల మొక్కలను నాటారు. మున్సిపల్ శానిటేషన్ సెక్రటరీ శ్రీధర్, కాలనీ ప్రెసిడెంట్ నీలకంటేశ్వర రావు, సీటీజీ సభ్యులు పాల్గొన్నారు.

సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో

సత్యసాయి సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు ఆదేశాల మేరకు ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పలు చోట్ల మొక్కలు నాటామని జిల్లా అధ్యక్షులు సూర రామచంద్రరావు తెలిపారు. తోలాపి సత్యసాయి సేవా సమితి ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామన్నారు. జిల్లా సేవా సమన్వయకర్త పి.నాగేశ్వర రావు, స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి బి.నరసింహ మూర్తి, కన్వీనర్లు, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో..

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శ్రీకాకుళం జిల్లా శాఖ ఆధ్వర్యంలో శాంతాకళ్యాణ్ అనురాగ నిలయంలో మొక్కలు నాటారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ.. పర్యావరణాన్ని కాపాడడానికి ప్రతివారు తమ ఇంటి ముందు మొక్కలు నాటాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ నిక్కు అప్పన్న, బి.చిన్మయ రావు, రెడ్‌క్రాస్ సభ్యులు, పిల్లలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రక్తనిధి కేంద్రంలో నలుగురు వలంటీర్లు రక్తదానం చేశారు. తలసేమియా బాధిత చిన్నారులకు మూడు యూనిట్ల రక్తం ఉచితంగా అందించారు.

ప్రకృతిని రక్షించుకుందాం

శ్రీకాకుళం: ప్రకృతిని రక్షించుకోవడం ద్వారా జీవుల మనుగడను కాపాడుకుందామని రిమ్స్‌లోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ , అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.మీచల్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. భూమిని కాపాడుకుందాం.. మొక్కలు నాటుదాం.. కరువు రాకుండా చూద్దాం అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డి.ఉషాపన్నగవేణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిణి కె.పద్మావతి, సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాలని శ్రీకాకుళం హయాతీ నగరంలోని ఎంజేపీఏపీబీసీ వెల్ఫేర్ బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ జి.స్వరాజ్యలక్ష్మి పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో మొక్కలునాటే కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై స్థానిక ప్రజలకు పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అవగాహన కల్పించారు.

కాకినాడ శ్రీఆదిత్య కళాశాలలో..

శ్రీకాకుళం నగరంలోని అంబేడ్కర్ జంక్షన్ సమీపంలో ఉన్న కాకినాడ శ్రీఆదిత్య కోఎడ్యుకేషన్ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పరిసరాలను పరిశుభ్రపరిచారు. కళాశాల రోడ్‌లో ప్రజలను చైతన్యపరిచేలా పలు నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీఎన్ వేణుగోపాల్, ఎన్ఎస్ఎస్ పీవో ఎం.నాగభూషణరావు, శ్రీనివాసరావు, పద్మావతి, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.


బలగ గ్రంథాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న దృశ్యం


ఎచ్చెర్ల క్యాంపస్: మొక్కలు పంపిణీ చేస్తున్న శివానీ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు


శ్రీకాకుళం కల్చరల్: ర్యాలీ చేస్తున్న సీటీజీ సభ్యులు



శ్రీకాకుళం న్యూకాలనీ: మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ స్వరాజ్యలక్ష్మి


శ్రీకాకుళం కల్చరల్:మొక్కలు నాటుతున్న సత్యసాయి సభ్యులు


శ్రీకాకుళం కల్చరల్: రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటుతున్న దృశ్యం


శ్రీకాకుళం: మొక్కలు నాటుతున్న నర్సింగ్ కళాశాల విద్యార్థులు


శ్రీకాకుళం న్యూకాలనీ: ర్యాలీ చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, కళాశాల సిబ్బంది

క్లుప్తంగా

ఘనంగా మహాలింగార్చన


మహాలింగార్చన నిర్వహిస్తున్న అర్చకులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి ఆలయంలో మాసశివరాత్రి సందర్భంగా బుధవారం ఉదయం అనివెట్టి మండపంలో మహాలింగార్చన కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో మహాపర్వం శివ పంచాయతన సహిత మహాలింగార్చనను అర్చకులు ఇప్పిలి ఫణీంద్ర శర్మ చేపట్టారు. అధికసంఖ్యలో భక్తులు లింగార్చనలో పాల్గొన్నారు. అనంతరం ఆదిత్యున్ని దర్శించుకున్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ కొయ్యాం వీసీబీ మార్పు కోసం ఈ నెల 7వ తేదీన విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏడీ ఎస్.బయ్యన్నాయుడు బుధవారం ప్రకటన విడుదల చేశారు. సబ్ స్టేషన్ పరిధిలోని ఎచ్చెర్ల, ఫరీదుపేట, ఎస్ఎంపురం, చిలకపాలెం, ఎస్ఎస్ఆర్‌పురం, జరజాం పంచాయతీల పరిధిలో ఉదయం 9 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు.

రిమ్స్ అన్నపూర్ణకు రూ.10 వేల విరాళం


విరాళం అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: రిమ్స్ అన్నపూర్ణ నిత్య అన్నదాన పథకానికి విశాఖకు చెందిన డాక్టర్ కిల్లాన రఘుచాణక్య తన సతీమణి మోనికా పుట్టిన రోజు సందర్భంగా రూ.10 వేలు విరాళం బుధవారం అందించారు. ఈ మొత్తాన్ని సంఘం కార్యదర్శి ఫాల్గుణరావు ద్వారా సంఘ అధ్యక్షులు గంగుల రమణ బాబు, జిల్లా అధ్యక్షులు సూర రామచంద్రరరావులకు అందించారు.

వర్షంతో హర్షం


కురుస్తున్న వర్షం

జి.సిగడాం: మండలంలో బుధవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతోపాటు భారీ వర్షం కురిసింది. ఈ వర్షం మెట్ట ప్రాంతాల రైతులకు ఉపయోగంగా ఉంటుందని రైతులు తెలిపారు.

13 నుంచి శివకామేశ్వర స్వామి వార్షికోత్సవాలు


శివ కామేశ్వరస్వామి

శ్రీకాకుళం కల్చరల్: మొండేటివీధిలోని లలితా దేవి సహిత శివకామేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఈనెల 13 నుంచి 17వ తేదీ వరకు జరుగుతాయని షిర్డీసాయి సేవా సంఘం సభ్యులు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 13న ఉదయం పందిరాట కార్యక్రమం, 15న ఉదయం అష్టోత్తర సహిత బిల్వార్చనలు, 16న ఉదయం సామూహిక మహన్యాస పూర్వ రుద్రాభిషేకాలు, 17న సాయంత్రం శివ పార్వతుల కల్యాణ మహోత్సవం జరుగుతోందని.. భక్తులందరూ పాల్గొనాలని కోరారు.

అంతర పంటలతో అధిక లాభాలు


కుప్పిలిలో పండిస్తున్న అంతరపంటలు

ఎచ్చెర్ల: మండలంలోని కుప్పిలి, అజ్జరాం, ఎస్ఎస్ఆర్‌పురం, ఎచ్చెర్ల వంటి వర్షాధార ప్రాంతాల్లో అంతర పంటలకు రైతులు ప్రాధాన్యం ఇస్తున్నారు. అంతర పంటల్లో భాగంగా ఒకేచోట పలు రకాల పంటలను వేయడం వల్ల ఒక పంటపోయినా మిగతా పంటలు పండటం వల్ల నష్టపోయే అవకాశం ఉండదని రైతులు అంటున్నారు. కొబ్బరి, ముల్లంగి, బెండ, మిరప, అరటి పంటలను ఒకేచోట వేసి పండిస్తున్నారు. దీనివల్ల తక్కువ భూమిలో తక్కువ పెట్టుబడితో పలు రకాల పంటలను పండించవచ్చని రైతులు అంటున్నారు.

'నీట్'లో నారాయణ విద్యార్థుల ప్రతిభ

శ్రీకాకుళం న్యూకాలనీ: వైద్య విద్య యూజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన నీట్-2024 ఫలితాల్లో నారాయణ కళాశాలకు చెందిన విద్యార్థులు విజయబావుటా ఎగుర వేశారు. ఈ ఫలితాలు మంగళవారం రాత్రి వెలువడిన విషయం తెలిసిందే. నారాయణ కళాశాల నుంచి గురుగుబెల్లి కిషోర్ 705 టాప్ మార్కులతో సత్తాచాటాడు. అలాగే పి.కిషోర్ పాణిగ్రాహి 674 మార్కులు, పొట్నూరు కార్తీక్ 666, వాకముల్లు వేణుగోపాలు 646, బొడ్డేపల్లి ప్రశాంత్ 643, ఆర్.సాయినిషిత్ 635, బొమ్మాన మానిక 631, ఎర్ర సుధీర్‌కుమార్ 623, కీర్తిశ్రీ కలిశెట్టి 606, పైల రస్మిత 602 మార్కులతో మెరిశారు. మెరుగైన మార్కులు సాధించిన విద్యార్థులను బుధవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కాలేజ్ డీన్ మణికుమార్, ఏజీఎం తిరుపతిరావు, గంగాధర్, ప్రిన్సిపాల్ పి.ప్రసన్నకుమార్ అభినందించారు. మొదటి ప్రయత్నంలోనే మంచి మార్కులు సాధించి ర్యాంకులు పొందడం సాధారణ విషయం కాదని వారంతా సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జగన్, సత్యన్నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగుల బోగీల్లోకి సాధారణ ప్రయాణికులు!


యశ్వంత్‌పూర్ సూపర్‌ఫాస్ట్ రైలు దివ్యాంగుల బోగీలోకి ఎక్కుతున్న సాధారణ ప్రయాణికులు


సాధారణ ప్రయాణికులతో రద్దీగా ఉన్న దివ్యాంగుల బోగీ

కాశీబుగ్గ: వేసవి సెలవులు ముగుస్తుండడంతో రైళ్లలో ప్రయాణికుల రద్దీ రోజురోజుకూ పెరుగుతోంది. దీంతో ఏసీ బోగీలు తప్పిస్తే జనరల్, రిజర్వేషన్ తేడా లేకుండా జనం కిక్కిరిసి ప్రయాణం చేస్తున్నారు. ఎక్స్‌ప్రెస్, సూపర్ ఫాస్ట్ రైళ్లకు ప్రారంభంలో ఉన్నటువంటి మహి, దివ్యాంగుల బోగీల్లో సాధారణ టిక్కెట్లు తీసుకున్నవారు ఎక్కేస్తున్నారు. దీంతో దివ్యాంగులు, మహిళా ప్రయాణికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. రైల్వే ఉన్నతాధికారులు, టికెట్ కలెక్టర్, గార్డులు, ఆర్‌పీఎఫ్, స్పెషల్ స్క్వాడ్ సరైన పర్యవేక్షణ లేకపోవడంతో ఇలా జరుగుతుందనే విమర్శలు వస్తున్నాయి. దివ్యాంగుల బోగీలో ప్రయాణానికి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్లపై ప్రచారం

కంచిలి: మండల కేంద్రం కంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టడం కోసం కళాశాల ప్రిన్సిపాల్ వి.జగదీష్ ఆధ్వర్యంలో అధ్యాపకులు ప్రచారం చేపట్టారు. ఇందులో భాగంగా బుధవారం మండలంలోని నారాయణబట్టి, గుండాం, కర్తలి, ఎం.ఎస్.పల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి అడ్మిషన్లు జరుగుతున్నాయని ప్రిన్సిపాల్ చెప్పారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూప్‌లలో తెలుగు, ఒడియా, ఇంగ్లిష్ మీడియంలో బోధన కలదని, నామమాత్ర ఫీజులతో అత్యుత్తమ విద్యాబోధన అందిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ కళాశాలలో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. అధ్యాపకులు వేణుగోపాల్, వాసుదేవ్, బబిత పాల్గొన్నారు.

భారీ వర్షం


జొన్నవలసలో కురుస్తున్న వర్షం.


దూసిలో ఇటుకలపై కప్పిన టార్పాలిన్లు

ఆమదాలవలస రూరల్: నైరుతి రుతుపవనాల రాకతో మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం బలమైన గాలులతోపాటు భారీ వర్షం కురిసింది. మునగవలస, జొన్నవలస, శ్రీహరిపురం, సైలాడ, గాజులకొల్లివలస, చిట్టివలస, కొత్తవలస, దూసి, తొగరాం గ్రామాల్లో ఎడతెరిపి లేకుండా వర్షం పడింది. రైతులు పొలం పనుల్లో నిమగ్నమవుతున్నారు. వరి విత్తనాలు వేసుకునేందుకు ఈ వర్షాలు అనుకూలంగా ఉంటాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

13న ప్రవేశ పరీక్ష

రణస్థలం: మండలంలోని రణస్థలం ఆదర్శ పాఠశాలలో 7, 8, 9వ తరగతుల్లో ప్రవేశానికి మిగిలి ఉన్న సీట్లు భర్తీ చేసేందుకు జూన్ 13వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ పి.శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఆదర్శ పాఠశాల పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 11వ తేదీలోగా తగిన ధ్రువీకరణ పత్రాలతో పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ 8978615698 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

జి.సిగడాం: గ్రామాల్లో వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జి.సిగడాం ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పేకల సుమబిందు సూచించారు. పెంట గ్రామ సచివాలయం హెల్త్ క్లినిక్‌లో రోగులకు బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. గ్రామంలో మంచానికి పరిమితమైన రోగులకు ఇంటివద్దకు వెళ్లి వైద్యసేవలను అందిస్తున్నామన్నారు. రోగలకు వైద్య పరీక్షలు చేసి మందులను అందించారు. సీహెచ్ఓ శివప్రసాద్ రావు, సూపర్‌వైజర్ భాస్కరరావు వైద్య సిబ్బంది పాల్గొన్నారు

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు


పూజలందుకున్న స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: బలగలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో బుధవారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు దేవరకొండ శంకరనారాయణశర్మ ఆధ్వర్యంలో స్వామికి పాలతో అభిషేకాలు నిర్వహించి స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

టెక్ మహీంద్రాకు ఆదిత్య విద్యార్థులు ఎంపిక

టెక్కలి: టెక్ మహీంద్ర సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగాలకు టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సీఎస్ఈ, ఈసీఈ, ఐటీ బ్రాంచ్‌లకు చెందిన 10 మంది విద్యార్థులు ఈ ఉద్యోగాలకు ఎంపికైనట్లు వెల్లడించారు. ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, హెచ్ఓడీలు యు.డి.ప్రసన్న, బి.రామారావు, వై.రమేష్ తో పాటు ప్లేస్‌మెంట్ అధికారి ఎం.వి.ఎస్.ఎస్.కుమార్ విద్యార్థులను అభినందించారు.

వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

నరసన్నపేట:

జిల్లా వ్యాప్తంగా శాఖా గ్రంథాలయాల్లో సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నామని, విద్యార్థులు అధిక సంఖ్యలో వచ్చి సద్వినియోగం చేసుకుంటున్నారని గ్రంథాలయ జిల్లా కార్యదర్శి బి.కుమార్‌రాజా అన్నారు. డిప్యూటీ లైబ్రేరియన్ వి.శంకరరావుతో కలిసి నరసన్నపేట శాఖా గ్రంథాలయాన్ని బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖా గ్రంథాలయాల్లో వేసవి శిబిరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. నరస్నన్నపేటలో విద్యార్థులు అధిక సంఖ్యలు హాజరవుతున్నారని సంతృప్తి వ్యక్తం చేశారు. మే 15 నుంచి వేసవి శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 7 వతేదీ వరకు వేసవి శిబిరాలు ఉంటాయన్నారు. లైబ్రేరియన్ చాయరతన్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కుమార్‌రాజా

స్నానాల గది నిర్మాణానికి రూ. లక్ష విరాళం

కంచిలి:

మండల కేంద్రంలో మఠం కంచిలి వద్ద గల స్వర్గధామంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్నానాల గది నిర్మాణానికి రొటేరియన్ కొత్తకోట శేఖర్ ఒక లక్ష రూపాయలను విరాళంగా ప్రకటించారు. ఈ మొత్తాన్ని రోటరీ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు, సెక్రటరీ పి.వి.కృష్ణారావు, ట్రెజరర్ కె.రవికుమార్‌లకు బుధవారం అందించారు.


విరాళాన్ని రోటరీ అధ్యక్షుడు శ్రీనివాసరావుకు అందిస్తున్న శేఖర్

ఆలయ అభివృద్ధికి విరాళం

కంచిలి: కంచమ్మతల్లి అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని వెంకటేశ్వరుని ఆలయం అభివృద్ధికి ఎన్ఆర్ఐ కొంచాడ శ్రీనివాస రావు రూ. 50,011లు విరాళాన్ని అందజేశారు. ఈ మేరకు దేవస్థానం బ్యాంకు అకౌంట్‌లో జమచేసినట్లు ఆలయ ప్రతినిధులు బుధవారం తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
శ్రీకాకుళం
9912220343
Office mail : sklmadvt@gmail.com